క్లుప్తంగా

గుంతలు పూడ్చేశారోచ్..



జీరవెల్లి సమీపంలో మొరం పోసిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి–లోలం గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీనిపై ఈనెల 2న సాక్షిలో గుంతలు బాబోయ్...గుంతలు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. సదరు గుంతల్లో తాత్కాలికంగా మొరం వేయించి పూడ్చివేశారు. సమస్య పరిష్కారం కావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో భక్తులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్–మస్కాపూర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో ఉన్న నల్లపోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముత్తయిదులవుచే గంగజలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణ, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, కోటపల్లి అనీశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మహాఅన్నదానం చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకులు తోకల బుచ్చనయాదవ్ తదితరులున్నారు.

'కాంగ్రెస్‌తోనే నిరుద్యోగ నిర్మూలన'

నర్సాపూర్(జి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగ నిర్మూలన తెలంగాణ రాష్ట్ర విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ శ్రీశైలం అన్నారు. బుధవారం మండలకేంద్రంతోపాటు, రాంపూర్ గ్రామాల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ ఇంట్లో తప్ప తెలంగాణలో ఎవరికి ఉద్యోగాలు రాలేదని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రసాద్, శ్రీకాంత్, రాజేందర్, నరేశ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గుస్సాడీ సంబురాలు



సంబురాల్లో ఆదివాసీలు

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో బుధవారం పలువురు ఆదివాసీలు గుస్సాడీ సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని బావాపూర్(ఆర్) పంచాయతీ పరిధిలోని పంగిడిగూడెం ఆదివాసీలు గుస్సాడీ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఏటా దీపావళి సందర్భంగా వారం పాటు ఆదివాసీలు ఈ సంబురాలు నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి రాజగంగన్న, ఖానాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, సుమన్, వీరేశ్, దేవన్న, శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీఈ నాగరాజు

ఖానాపూర్: విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కరించాలని డీఈ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో బుధవారం ఖానాపూర్, కడెం, మామడ, పెంబి, దస్తురాబాద్ మండలాల విద్యుత్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. సంస్థ అంతర్గత సామర్థ్యంతోపాటు రెవెన్యూ వసూళ్లను పెంచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు తగ్గేలా దృష్టి సారించి బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఏవో సుదర్శన్, టెక్నికల్ డీఈ రత్నకుమారి ఏడీఈ కౌట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పథంలో వాటోలి

- పారిశుధ్య కార్మికులకు వాకీటాకీలు
- పరిశుభ్రతకు పెద్దపీట
- ఆహ్లాదం పంచుతున్న పచ్చదనం
- జిల్లాస్థాయి అవార్డులకు ఎంపిక



వాటోలిలోని ఏపుగా పెరిగిన మొక్కలు

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహదారిని ఆనుకుని వానల్‌పాడ్ గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాటోలి పంచాయతీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. పరిశుభ్రత, పచ్చదనానికి పెద్దపీట వేసి.. ఎక్కడా లేని విధంగా పారిశుధ్య సిబ్బందికి వాకీటాకీలు అందించారు. పంచాయతీ భవనంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి.. ఎక్కడైనా డ్రెయినేజీ, చెత్తాచెదారం సమస్య ఉంటే వాకీటాకీలో చెప్పగానే సిబ్బంది అక్కడకు వెళ్లి శుభ్రం చేస్తారు. దీంతో ప్రజలు కూడా రోగాల బారిన పడకుండా ఉంటున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితోపాటు గ్రామస్తులు కలిసికట్టుగా పనులు చేయడంతో వాటోలి గ్రామం పూర్తిగా మారిపోయింది.

ఏపుగా పెరిగిన మొక్కలు..

వానల్‌పాడ్ నుంచి వాటోలి వెళ్లే మార్గంలో రెండు కిలోమీటర్ల మేర హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలను సంరక్షించడంతో నేడు చెట్లుగా మారాయి. ఇక గ్రామంలో ప్రధాన వీధుల్లోనూ పెంచిన మొక్కలు ఆహ్లాదం పంచుతున్నాయి. పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రకృతివనంలో వివిధ రకాల మొక్కల పెంపకంతోపాటు చిన్నారులు ఆడుకునేందుకు వివిధ ఆట పరికరాలు, యువకుల కోసం షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. నిత్యం సాయంత్రం పార్కుకు వచ్చి చిన్నారులు, పెద్దలు, వృద్ధులు ఉల్లాసంగా గడుపుతున్నారు.

పంచాయతీకి వచ్చిన అవార్డులు..

పాలకులు, అధికారులతోపాటు గ్రామస్తుల కృషితో పంచాయతీ పలు విభాగాల్లో అవార్డులు సాధించింది. వాటోలి గ్రామం పేదరిక రహిత పంచాయతీగా, నీటి స్వయంసమృద్ధి పంచాయతీగా, పచ్చదనం, పరిశుభ్రతలో పంచాయతీ సుపరిపాలనలో, పిల్లల స్నేహపూర్వక పంచాయతీ విభాగాలతోపాటు 2022లో ఆరోగ్య పంచాయతీగా, మహిళల స్నేహపూర్వక పంచాయతీగా, జీవనోపాధి కల్పన, మౌలిక వసతుల కల్పన విభాగంగా వాటోలి గ్రామం అవార్డులను అందుకుంది.



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ నిఖిత (ఫైల్)

ఉన్నతాధికారుల ప్రశంసలు..

వాటోలి పంచాయతీ అభివృద్ధి గురించి తెలిసి పలువురు ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించారు. అప్పటి కలెక్టర్లు ఇలంబర్తి, ప్రశాంతి, ముషారఫ్ అలీ ఫారూఖీ, డీఆర్డీవో విజయలక్ష్మి గ్రామానికి వెళ్లి సిబ్బంది వాకీటాకీలో మాట్లాడే తీరు, పరిశుభ్రత గురించి తెలుసుకున్నారు. మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సైతం గ్రామాన్ని సందర్శించారు. రాష్ట్రంలోనే ఉత్తమ పంచాయతీగా వాటోలిని తీర్చిదిద్దుతామని ఇక్కడి బృందం అధికారులకు తెలిపింది. అందుకు తగ్గట్టుగానే అంతా కలిసి పని చేస్తున్నారు.



పారిశుధ్య సిబ్బందికి ఇచ్చిన వాకీటాకీలను పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి(ఫైల్)

ఐక్యతతోనే అభివృద్ధి



గ్రామస్తులు ఐక్యంగా ఉండి పనులు చేయడంతోనే అభివృద్ధి సాధ్యమైంది. ఏ సమస్య వచ్చినా కలిసికట్టుగానే ముందుకెళ్తాం. మా కష్టానికి గుర్తుగా ప్రభుత్వం పలు విభాగాల్లో మా గ్రామానికి అవార్డులు కూడా అందించింది.

– వైద్యనాథ్, గ్రామస్తుడు

మొక్కలను సంరక్షిస్తున్నాం



పంచాయతీ పరిధిలో గతంలో నాటిన మొక్కలను సంరక్షించడంతో ఏపుగా పెరిగాయి. దీంతో రోడ్లకు ఇరువైపుల, ఖాళీస్థలాల్లో, ఇంటి ముందు పచ్చదనం ఆహ్లాదాన్ని పంచుతోంది. రోడ్లను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. డ్రైనేజీల నిర్వహణ బాగుంది.

– దిగంబర్, గ్రామస్తుడు

అందరి సహకారంతో..

అందరి సహకారంతో వాటోలి గ్రామం అభివృద్ధి వైపు పయనిస్తుంది. ఎక్కడా రోడ్లపై చెత్తాచెదారం వేయవద్దని అవగాహన కల్పిస్తున్నాం. రోడ్లన్నీ శుభ్రంగా కనిపిస్తాయి. గ్రామ అభివృద్ధిలో యువకులు, పెద్దల పాత్ర ప్రత్యేకమైంది.

– నిఖిత, సర్పంచ్

పేదలకు వరాలుగా బీఆర్ఎస్ పథకాలు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

దిలావర్‌పూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల ఇంట వరాలుగా నిలిచాయని ఆ పార్టీ నిర్మల్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాల్వ, కాల్వతండా, సిర్గాపూర్, ఇడ్డేపల్లి, మాయాపూర్, బన్సపల్లి, కంజర్, సాంగ్వి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కాల్వలో పర్యటించి అటవీ ప్రాంతంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామానికి వచ్చిన ఆయన 70 మంది బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రూ.15లక్షల వరకు ఆరోగ్య బీమాను అందిస్తామని అన్నారు. బన్సపల్లి ఎత్తిపోతల పథకం పనులను రూ.90 కోట్లతో పునరుద్ధరిస్తామని బన్సపల్లి, కంజర్, దిలావర్‌పూర్, లోలం రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాష్‌రావు, కాల్వ సర్పంచ్ ఆడెపు తిరుమల శ్రీనివాస్, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సిర్గాపూర్, మాయాపూర్, సర్పంచ్‌లు గంగారెడ్డి, మహేశ్, పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, నిమ్మల చిన్నయ్య, సప్పల రవి, ధనె రవి, పాల్దె అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లో మంత్రి ఐకేరెడ్డికి స్వాగతం పలుకుతున్న దివ్యాంగుడు, మహిళలు

పార్టీలో చేరిక..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్మల్‌రూరల్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 150 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ గోవర్ధన్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, అల్లోల గౌతమ్‌రెడ్డి, అల్లోల తిరుపతిరెడ్డి ఉన్నారు.

మామడ: మండలంలోని బండలఖానాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఇతర పార్టీలకు రాజీనామా చేసి బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అల్లోల గౌతంరెడ్డి, దేవేందర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో తులసి, గంగారం, ముత్యం తదితరులున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగు లింగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, కాలగిరి గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

అమరుల ఆశయ సాధనకు పోరాడుదాం

సోన్: భూమి కోసం, భుక్తి కోసం పోరాడి అమరులైన వీరుల సంస్మరణ సభను సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదని.. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించినప్పుడే అమరవీరులకు నిజమైన ఘన నివాళి అని పేర్కొన్నారు. వారి ఆశయ సాధనకు పోరాడుదామన్నారు. కార్యక్రమంలో పలువురు ఐఎఫ్‌టీయూ నాయకులు లక్ష్మణ్, గోపాల్, జనార్దన్, ముత్తవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: రైతుల సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని రైతుసంఘం నిర్మల్ డివిజన్ కార్యదర్శి గణేశ్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి వారు మాట్లాడారు. తొమ్మిదేళ్ల ఏళ్ల పాలనలో సీఎం కేసీఆర్.. రైతులకు చేసింది శూన్యమన్నారు. కనీసం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఖానాపూర్ మండలంలో నిర్మించాల్సిన సదర్మాట్ బ్యారేజీని మంత్రి ఐకేరెడ్డి తన నియోజకవర్గంలోని మామడ మండలానికి తరలించారని పేర్కొన్నారు. సదర్మాట్ నుంచి ఖానాపూర్ వరకు ప్రత్యేక కాలువ ఏర్పాటు విషయమై సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సురేందర్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప, నిర్మల్ పట్టణ కార్యదర్శి హైమద్ తదితరులు ఉన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జాన్సన్‌నాయక్



ఖానాపూర్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాన్సన్‌నాయక్

- బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

జన్నారం: ప్రజలు ఆశీర్వదించి ఈ సారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశమివ్వాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని కలమడుగులో బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, పార్టీ మండల అధ్యక్షుడు రాజరాంరెడ్డి, కలమడుగు గ్రామ సర్పంచ్ కార్తీక్‌రావు, ఎంపీటీసీ స్వరూపరాణి, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, గ్రామ పార్టీ నాయకులు స్వదేశ్‌కుమార్, జాడి శంకర్, సంతోష్, గోపాల్, సత్తన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖానాపూర్: పేదప్రజల అభివృద్ధి కోసం మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో బీజేపీ నాయకుడు, వార్డు మాజీ సభ్యుడు సిరిగారపు లింగన్న ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాన్సన్‌నాయక్ హాజరై వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజేందర్, నారాయణరావు, ఖలీల్, శ్రీనివాస్, సంతోష్, జానుబాయి, సురేశ్, శంకర్, వెంకటప్పయ్య ఉన్నారు.

గ్రామాల్లో ముమ్మర ప్రచారం

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. మండలంలోని బీర్నంది గ్రామంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మోహిద్, రాజగంగన్న, లక్ష్మణ్‌రావు, శ్రీధర్, భూమేశ్ ఉన్నారు.

కంటి ఆపరేషన్ల కోసం తరలింపు

ఖానాపూర్: పట్టణంలోని మాధవి కంటి ఆస్పత్రిలో ఇటీవల పరీక్షలు చేయించుకున్న 10 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల నిమిత్తం బుధవారం ప్రత్యేక వాహనంలో ఆర్మూర్ కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్‌క్లబ్, నేత్ర వైద్య నిపుణులు నిఖిత సంయుక్తంగా ఇటీవల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, సుదర్శన్, వెంకటేశ్వర్లు, చరణ్ తదితరులు ఉన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



కారు తనిఖీ చేస్తున్న సీఐ వినోద్

తానూరు: ఎన్నికల వేళ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వర్తించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ముధోల్ సీఐ వినోద్ అన్నారు. బుధవారం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని వడ్గాం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసిన తర్వాతనే తెలంగాణలోకి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. సరిహద్దు ప్రాంతంలో బందోబస్తు నిర్వహించి తనిఖీలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీజేపీలోకి లక్ష్మణచాంద ఎంపీపీ



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పద్మ, ప్రజాప్రతినిధులు

లక్ష్మణచాంద: స్థానిక ఎంపీపీ అడ్వాల పద్మ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. గురువారం ఇదే పార్టీకి చెందిన చామన్‌పెల్లి ఎంపీటీసీ సభ్యురాలు అనిత, చింతల్‌చాంద సర్పంచ్ రాజామణి, న్యూకంజర్ సర్పంచ్ శోభారాణితో కలిసి పద్మ రాజీనామా చేశారు. అనంతరం నిర్మల్ బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి కిషన్‌రెడ్డి కాషాయ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు అడ్వాల రమేశ్, సురేశ్, ప్రభాకర్, కిష్టునాయక్, భూపాల్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ఒస రాజు, గోవర్ధన్ తదితరులున్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం పలువురు బీజేపీలో చేరారు. సోన్ మండలం కడ్తాల్ గ్రామ హిందూసేన యూత్ సభ్యులు, మామడ మండలం పరిమండల్, లక్ష్మణచాంద మండలం బోరిగాం గ్రామాల నాయకులు, దిలావర్‌పూర్‌తోపాటు గుండంపల్లి, కాల్వ గ్రామ రజక సంఘం సభ్యులు బుధవారం బీజేపీలో చేరగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటేయండి

- పార్టీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు



పార్‌పెల్లిలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటేయాలని ఆ పార్టీ నిర్మల్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు అన్నారు. బుధవారం మండలంలోని వడ్యాల్‌తండా, రాచాపూర్, పీచర, ధర్మారం, పార్‌పెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్.. నిరుద్యోగులను నిండా ముంచారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు రాచాపూర్‌కు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి శ్రీహరిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గాజుల రవికుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్ ప్రతాప్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యాక్టరీ తరలించే వరకూ విశ్రమించా'

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ ఏర్పాటు చేసే విషవాయువులు చిమ్మే ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించే వరకు విశ్రమించబోమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు అన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కలిసి కట్టుగా పనిచేశారని విమర్శించారు. దిలావర్‌పూర్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ ఫ్యాక్టరీ పూర్తయితే దిలావర్‌పూర్, గుండంపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిలావర్‌పూర్‌లో ఒక్కరికీ కూడా డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని.. తనను గెలిపిస్తే ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరుస్తానని హామీ ఇచ్చారు. ఇందులో మైనారిటీ నాయకుడు అర్జుమన్, కాంగ్రెస్ నాయకులు అర్గుల రమణ, దమ్మ రవి, సయ్యద్ యూసుఫ్, కట్కం రాజారెడ్డి, కోడె శ్రీనివాస్, షేక్ వసీం, ముస్కు నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కట్టాలని శ్రీహరిరావు కూతురు మాధురి అన్నారు. బుధవారం మండలంలోని ప్యారమూర్ దత్తాత్రమంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. రాజేశ్వర్, సాహెబ్‌రావు, మారుతి, హాదీ, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన లింగాపూర్ సర్పంచ్

మామడ: మండలంలోని లింగాపూర్ సర్పంచ్ అంబిబాయి గంగారాం, ఉపసర్పంచ్ అంబాజీలతో పాటు పలువురు గ్రామస్తులు బుధవారం జిల్లా కేంద్రంలో శ్రీహరిరావ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను విధిగా పాటించాలని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్‌లో బుధవారం రోడ్డుభద్రత నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడాతూ ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలన్నారు. శిక్షణ పొందిన డ్రైవర్లే ఆర్టీసీ బస్సులను నడుపుతారని పేర్కొన్నారు. తీర్థయాత్రలకు, శుభకార్యాలకు అద్దెకు బస్సులు ఇస్తున్నామని.. అవసరమైన వారు బస్టాండ్‌లో సంప్రదించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది రమణ, కేఎం రెడ్డి, నర్సయ్య, నారాయణ, మల్లయ్య, పలువురు ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

లోకేశ్వరం: ఈనెల 30న జరిగే ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

డీఎల్‌పీవో పర్యటన

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది, కొలాంగూడ గ్రామాల్లో బుధవారం నిర్మల్ డీఎల్‌పీవో రమేశ్ పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీవో చంద్రశేఖర్, హెచ్‌ఎం సురేశ్, పంచాయతీ కార్యదర్శులు రమణ, హనుమంతు, మహేశ్, వీవోఏ రవీందర్, సిబ్బంది రాజు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



న్యూవెల్మల్‌లో ప్రారంభిస్తున్న ఏఓ వినోద్

సోన్: కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల పంటలకు మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయాధికారి వినోద్ అన్నారు. బుధవారం మండలంలోని న్యూవెల్మల్‌లో ఎఫ్ఎస్‌సీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని ఆరబెట్టి తాలు, తప్ప లేకుండా చూడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అంబాజీ, వీడీసీ అధ్యక్షుడు రెమ్మాయి సాగర్, కోశాధికారి కొండ రవి, కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, మల్లయ్య, భోజన్న, శ్రీనివాస్, నారాయణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో, పొట్టపెల్లి(కే) గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులకు తక్కువ ధరకు విక్రయించి అన్నదాతలు నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు సంతోష్, పవిత్ర, ఎఫ్ఎస్‌సీఎస్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.